# వాయుపుత్రుడి గాలి

సూర్య భగవానుడు ఆకాశంలోపైకి వచ్చినా, సూతమహాముని మాత్రం ఆ రోజు ఇంకా సరయూ నదీ తీరానికి రాలేదు.

పంగనామాల పెద్దకోతి, హనుమంతుడిలా తోక చుట్ట చుట్టుకుని, దాని పైన కూర్చుందామని ప్రయత్నించింది కానీ, తోక మరీ చిన్నదవటం వల్ల అది సాధ్యం కాలేదు. అయినా మళ్ళీ మళ్ళీ ప్రయత్నించబోయింది. ఈలోగా నైమిశారణ్యంలో నైఋతీ దిశనించి వచ్చిన గాలి గట్టిగా వీచటంతో, పంగనామాల పెద్దకోతి బోర్లా పడింది.

అది చూసి ఎర్రమూతి నల్లకోతులూ, నల్లమూతి తెల్లకోతులూ, తెల్లమూతి ఎర్ర కోతులూ ఒకటే గోల చేస్తూ, ఎగిరి గంతులు వేస్తూ, మరో కిష్కింధాకాండని గుర్తు చేస్తున్నాయి.

పక్కనే వున్న రామచిలుక గోరింకతో అంటున్నది. "ఈ మధ్య జనం చిలక జోస్యం చెప్పించుకోకుండా, కంప్యూటర్ మీద తమ జాతకాలు చూసుకుంటున్నప్పటి నించీ, నాకు కాస్త తెరిపిగా వుంది. అందుకని కొంచెం తెలుగుసాహిత్య పఠనంలో పడ్డాన్లే!" అన్నది.

"కొయ్ కొయ్! అన్నీ గొప్పలు. నేను చదివిన దాని ముందు నువ్వు చదివిందెంత?" అన్నది గోరింక.

"నేను చదివిందేదో నేను చెబుతున్నాను. నీతో నాకు పోలికేమిటి. మునిమాణిక్యం నరసింహారావు గారు ఏం వ్రాశారో తెలుసా? ఇద్దరు తెలుగువాళ్ళుఒకచోట చేరితే రెండు పార్టీలుంటాయని" అన్నది రామచిలుక తన ఆకుపచ్చటి అందాలని ప్రదర్శిస్తూ.

"నేను చెప్పిందదే నీకేమీ తెలీదని. ఆ మాట అన్నది మునిమాణిక్యం నరసింహారావు గారు కాదు. ముళ్ళపూడి వెంకటరమణ గారు" అన్నది గోరింక గర్వంగా.

"కాదు. మునిమాణిక్యం" అన్నది రామచిలుక.

"ముళ్ళపూడి అంటుంటే వినవేం" అన్నది గోరింక.

ఇద్దరూ ఒకళ్ళ మీద ఇంకొకళ్ళు అరుచుకుంటున్నారు.

"ష్!" అన్నాడు శౌనకుడు.

"సూతులవారింకా రాలేదేమిటి చెప్మా!" అన్నాడు శుకమహర్షి అటూ ఇటూ చూస్తూ.

గోరింక రామచిలుకతో అంది. "తెలుగు భాష తెలుగువారి ప్రవర్తనని గుర్తుచేస్తున్నది అనెక్కడో చదివాను. అన్ని భాషల్లోనూ అక్షరాలు ఒకదానికొకటి కలిపి వ్రాస్తారు. హిందీలో అయితే అన్ని అక్షరాల్నీ కలుపుతూ పైన ఒక గీత కూడా గీస్తారు. కాని తెలుగులో అలా కాదు. అన్నీ వేరు వేరుగా, ఒక దానితో ఒకటి కలవకుండా వుంటాయి. అలాగే ఒక అక్షరం మీద ఇంకొక అక్షరం వ్రాయటం ఏ భాషలోనూ లేదు. తెలుగులో "క్ష"అనీ, "త్య"అనీ ఒక అక్షరం మీద ఇంకొక అక్షరం వ్రాస్తాం. ఎందుకంటే ఒక తెలుగు వాడికి, ఇంకొక తెలుగువాడి నెత్తిన ఎక్కటమంటే మహాసరదా. ఇవి నా మాటలు కావు. నండూరి రామ్మోహన్రావ్‌గారివి"

రామచిలుక ఎర్రటి చిలుక ముక్కుతో పకపకా నవ్వింది. "అందుకే నీకేం తెలీదనేది. తెలుగులో గొలుసు కట్టుగా వ్రాయటం కూడా వుంది. అంతే కాదు. ఆ మాటలన్నది నండూరి రామ్మోహన్రావ్‌గారు కాదు. భమిడిపాటి కామేశ్వరరావుగారు" అన్నది.

"అలా ముక్కుతో నవ్వకు. ముక్కు మీద కోపం అందం కానీ, నవ్వు కాదు" అన్నది, తన ముక్కుమీద కోపాన్ని అందంగా చూపిస్తూ గోరింక.

అన్నీ వింటున్న కోయిల, తన తీయటి గొంతుతో అన్నది "అందరూ చిలకా గోరింకల్లా అన్యోన్యంగా వుండాలనుకుంటారు. చిలుకా గోరింకలయి కూడా మీరేమిటి ఇలా కొట్టుకుంటున్నారు!"

"ష్!" అన్నాడు శుకమహర్షి.

"సూతులవారు ఇంకా రాలేదే!" అన్నాడు శౌనకుడు అటూఇటూ చూసి

"నిన్ననే అనుకున్నాను సూతులవారికి కొంచెం సుస్తీ చేసిందే అని. ఆయన వచ్చే లోపల నేను ఒక చిన్న కథ చెప్పనా?" అన్నాడు చిన్న ముని కొంచెం ధైర్యం చేసి.

"వద్దులే! నువ్వేం చెప్తావ్" అన్నారు సర్వజంతుజాలమూ ఒకే గొంతుతో.

"ష్! అలా అనకూడదు. చెప్పనీ. చిన్నవాడయినా కథ చెప్పటానికి ముందుకు వచ్చాడు కదా!" అన్నాడు శౌనకుడు.

గర్వంగా అందర్నీ ఒక్కసారి చూసి, చిన్నముని శౌనకాది మునులతో ఇట్లా

అన్నాడు.

"ఈ కథ నాకీ మధ్య ఒక కలలాగా వచ్చింది. నిద్రపోకుండా మరీ గుర్తు పెట్టు కున్నాను. ..."

"నిద్ర పోకపోతే కల ఎలా వస్తుందమ్మా! మరీ చోద్యం!" అన్నది జిరాఫీ మెడ కొంచెం పైకి సాగదీస్తూ.

"ష్! కథ చెప్పనీ" అన్నాడు శుకుడు.

"అది ఒక ద్వీపం. దాని పేరు లంబూ ద్వీపం. అక్కడ జంబూ ద్వీపం నించి వచ్చి న జనం చాలమంది వున్నారు. వాళ్ళు మాట్లాడే భాష పేరు త్రిలింగం"

"త్రిలింగం అంటే తెలుగే. తెలుగు, ఆంధ్రము, త్రిలింగము అని, అన్నీ ఒక్కటే" అంది ఎర్రమూతి తెల్లకోతి.

"అవును. కాళహస్తి, శ్రీశైలం, అమరావతి అనే మూడు శివక్షేత్రాలని కలిపి త్రిలింగం అన్నారు!" అన్నది నల్లమూతి తెల్లకోతి.

"నువ్వు చెప్పింది తప్పు. మూడో క్షేత్రం అమరావతి కాదు. ద్రాక్షారామం" అన్నది తెల్లమూతి నల్లకోతి.

"ద్రాక్షారామం కాదు, అమరావతే!" అన్నది నల్లమూతి తెల్లకోతి.

"ఇవాళ మీరందరూ ఎందుకిలా వాదించుకుంటున్నారు. అసలేమయింది" విసుక్కున్నాడు శౌనకుడు.

"చిన్నమునిని కథ చెప్పనీయకుండా అడ్డం వస్తున్నారెందుకూ! నువ్వు కథ చెప్ప వయ్యా" అన్నాడు శుకమహర్షి.

"వాళ్ళందరూ అక్కడ కొన్నాళ్ళు బాగానే వుండి, ఒకే తాటి మీద, ఒకే మాట మీద నడిచినా వాళ్ళ భాషా భేధం వాళ్ళని విడగొట్టింది. దాంతో క భాషమాట్లాడేవాళ్ళు కభాసం అనీ, ర భాష మాట్లాడేవాళ్ళు రభాసం అనీ రెండు భాషాసంఘాలుగా విడిపోయారు. వాళ్ళలా విడిపోటానికి కారణం, జంబూద్వీపం నించి వచ్చిన కొందరు భాషా కోవిదులు అని అంటారు కానీ, నాకలా అనిపించలేదు. ఆ భాషాకోవిదులకి బుద్ధి లేకపోతే, వీళ్ళకేమయింది? ఇలా లంబూ ద్వీపంలో, రెండు సంఘాలు వారివారి భాషల్ని అభిమానిస్తూ, వేరే భాషలవారిని యధాశక్తి చిన్నచూపు చూస్తూ కాలం గడపసాగారు. కాస్త సంస్కారమున్నవాళ్ళు మాత్రం, ఆ రెండు సంఘాల సంకుచిత భావాల్ని చూసి జాలిపడే వాళ్ళు. నవ్వుకునే వాళ్ళు. అప్పుడప్పుడూ పెద్దగా వాళ్ళ ముఖాన్నే నవ్వేసే వాళ్ళు. ఈలోగా ఒక గమ్మత్తుజరిగింది. కభాసం ప్రెసిడెంటు గారి అబ్బాయి, చదువుతో పాటూ సంస్కారంకూడా బాగా చదువుకుని, పాచిపట్టిన వీళ్ళ భావాలను అసహ్యించు

కుని అటు కభాష వాళ్ళనీ, ఇటు ర భాషవాళ్ళనీ కాదని, వేరే మ్లేచ్ఛ భాష వారి అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. అలాగే ర భాసం ప్రెసిడెంట్‌గారి అమ్మాయి కూడా సంస్కారంతో పాటూ, తన చదువుని కూడా బాగా సంస్కరించుకుని, కంపు కొట్టేవాళ్ళ భావాలని టాయిలెట్లో ఫ్లష్ కొట్టేసి, తను కూడా ఒక మ్లేచ్ఛ భాష వారి అబ్బాయిని పెళ్ళాడేసింది. ఇంకొక గమ్మత్తేమిటంటే, తెలుగు సినిమాలోలా ఆ మ్లేచ్ఛ భాష వారి పెళ్ళికూతురూ, పెళ్ళికొడుకూ స్వయానా అన్నా చెల్లెళ్ళు. అలా జంబూద్వీపానికి వలస వచ్చి, భాషా భేదాల వల్ల వేరు పడిన ఆ లంబూ ద్వీపవాసులు మ్లేచ్ఛ భాషాసంపర్కంతో మళ్ళీ స్నేహితులే కాదు, బంధువులుకూడా అయారు. ఈ బేధాలు లేని ముందు తరాల వాళ్ళ కథ ఇంతటితో సుఖాంతం అయింది"

"మరి కభాసం, రభాసం అధ్యక్షులు ఈ రభసతో పిచ్చివాళ్ళయి పోయి గ్రాండ్ కాన్యన్‌లోనో, నయాగరా జలపాతంలోనో దూకలేదా?" అడిగింది నల్లమూతి నల్లకోతి, చెట్టు మీద నించి కిందకు దూకుతూ.

చిన్నముని అడ్డం వస్తూ అన్నాడు "తర్వాత తరం పిల్లల కథ సుఖాంతం అన్నాను కానీ, కభాసం రభాసం వాళ్ళ కథ కాదు. వాళ్ళు కూడా చిన్నవాళ్ళనీ, చితకవాళ్ళనీ చూసి, కాస్తో కూస్తో ఆ సంస్కారాన్ని బట్టీపట్టి, కొంచెం పరభాషా సహనం అలవాటు చేసుకున్నారు. తమ కార్యవర్గంలో క భాష, ర భాష వాళ్ళనే కాకుండా అటు కచటతపల వాళ్ళనీ, ఇటు గజడదబల వాళ్ళనీ కార్యవర్గ సభ్యులుగా చేర్చుకున్నారు"

"అంటే బి.జె.పీ.లో బక్రూద్దీన్‌గారిని చేర్చుకున్నట్టన్నమాట!" అన్నది గుంట నక్క, గుంటలో నించి బయటకు వచ్చి.

"ఇదేదో పిచ్చికథ. చిన్నముని మాటల్లాగానే ఈకథకీ అర్థం లేదు" అన్నది గున్న ఏనుగు చెవిలో గోల పెడుతున్నోమని తన బారెడు చెవులతో చాచి ఒకదెబ్బ కొడుతూ.

"ఇవాళ మన కథలన్నీ విడిపోవటం భేదాభిప్రాయాలతో వాదించుకోవటం మీదే జరుగుతున్నాయి. కారణం తెలియటం లేదు!" అన్నాడు శౌనకుడు సాలోచనగా.

"అదే నాకూ అర్థం కావటం లేదు. ఎందుకు ప్రతి చిన్నవిషయానికీ అనంగీకారాలూ, దురభిమానాలూ, పోట్లాటలూ. జంబూ ద్వీపంలో అచ్చం ఇలాగే జరుగుతుంటాయి. ఇంతకు ముందు కన్నాకూడా ఈమధ్య జంబూ ద్వీపంలో కులమత, భాషా, ప్రాంతీయ రాజకీయాలు విపరీతంగా పెరిగిపోయాయి. దేవుడు సృష్టించిన ఈమనిషికి స్వలాభం కోసం సృష్టించుకుంటున్న ఈ దురభిమానం, ద్వేషం, విడిపోవాలనే ఈ దుర్బుద్ధి ఎలా వచ్చాయి" అన్నాడు శుకమహర్షి.

అప్పుడేవచ్చి సూక్ష్మబుద్ధితో కథనంతా అర్థం చేసుకున్న సూతుడు, మామూలు

గా కథల మధ్య అందించే చిరునవ్వుని ఈ సందర్భంలో చూపించటం ఇష్టం లేక తన తెల్లటి గడ్డం వెనుక దాచేసుకున్నాడు.

"ఒక దేశంవారిలోనే ప్రాంతీయాభిమానం, భాషాభిమానం, మతాభిమానం. ఒక రాష్ట్రం వారిలోనే మళ్ళీ ప్రాంతీయాభిమానం, మతాభిమానం, కులాభిమానం. ఒక మనిషికీ ఇంకొక మనిషికీ మధ్య ఇలా గీతలు గీసుకోవటం ఎందుకు? అందరిలోనూ పారే రక్తం రంగూ ఒక్కటే, బయట శరీర నిర్మాణమూ ఒక్కటే కదా" అన్నాడు సూతుడు బాధ పడుతూ, మానవత్వానికి విలువనిచ్చే మహనీయుడు కనుక.

"అక్కడే కాదు మహాముని! ఇక్కడ కూడా ఇందాకట్నించీ చూస్తున్నాను. చిలకా గోరింకలకు పడటం లేదు. కోతులలోనే మాటామాటా వచ్చింది. చిన్నముని చెప్పిన కథ కూడా అలాటిదే. ఎక్కడినించీ వీచిందీ గాలి? ఎందుకిలా విడిపోతున్నారివాళ?" అన్నాడు శౌనకుడు కూడా బాధ పడుతూ.

అన్ని దిక్కులకీ దృష్టి సారించిన సూతమహాముని సూక్ష్మదృష్టి, పంగనామాల పెద్దకోతి మీద పడింది. హనుమంతుడిలా తోక చుట్ట చుట్టుకుని, దాని మీదకూర్చుందామని ఇంకా ప్రయత్నం చేస్తూనే వుంది. కానీ తోక మరీ చిన్నదవటం వల్ల అది సాధ్యం కావటం లేదు. క్రింద పడుతున్నా కూడా లెఖ్ఖ చేయకుండా, ఆ కోతి మరీ మరీ అలా ప్రయత్నం చేస్తూనే వుంది. ఆ వీచే గాలి అటు నించే వస్తున్నది.

అది చూసిన సూతమహాముని ముఖంలో చిరునవ్వు చిందులాడింది.

డార్విన్ సిద్ధాంతం గుర్తుకు వచ్చి "హా తెలిసెన్" అని పెద్దగా అనబోయి, మహాముని కనుక అలా అంటే బాగుండదని, ఇలా అన్నాడు.

"నాకు అసలు కారణం తెలిసిపోయింది. అది మన ముత్తాతల ముత్తాతల ముత్తాతల దగ్గర నించీ వచ్చింది. అది మన వాయుపుత్రుడి గాలి. అందుకే అలా వీస్తున్నది" అన్నాడు చిరునవ్వుతో.